# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- వెనుకబడిన వర్గాల రక్షణకు త్వరలో ప్రత్యేక చట్టాన్ని తీసుకువస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (LEAP) పేరిట నూతన విద్యా విధానానికి శ్రీకారం చుట్టామని మంత్రి నారా లోకేష్ తెలిపారు.
- ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం ప్రారంభమయ్యింది.
- రాష్ట్రంలో ఇంటర్మీడియట్ ఫలితాలు రేపు విడుదల కానున్నాయి.
- మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు ఘనంగా నిర్వహించారు.

=====================

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఏలూరు జిల్లా నూజివీడు ఆగిరిపల్లిలో నిర్వహించిన మహాత్మ జ్యోతిరావు పూలే రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. దీనిలో భాగంగా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన ప్రజా వేదికలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... సంక్షేమంలో బీసీలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. కార్పొరేషన్లు ద్వారా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. త్వరలో బీసీల కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకువస్తామని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

=====================

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ ఫలితాలను రేపు విడుదల చేయనున్నామని ఇంటర్మీడియట్ విద్యా మండలి ఒక ప్రకటనలో తెలిపింది. రేపు ఉదయం 11 గంటలకు ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు విడుదల చేస్తామని పేర్కొంది. ఫలితాలను resultsbie.ap.gov.in ద్వారా తెలుసుకోవచ్చని అలాగే మన మిత్ర యాప్ ద్వారా వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 95523 00009కు.. హాయ్ అని సంక్షిప్త సందేశం పంపడం ద్వారా ఫలితాలను తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

=====================

వైయస్సార్ కడప జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం ప్రారంభమయ్యింది. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల 30 నిమిషాల వరకు ఈ కళ్యాణ మహోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీతారాములకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారు.

=====================

రాష్టంలో అవినీతిరహిత పాలన అందించేదుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని విద్య, ఐటీ, శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరిలో నాలుగవ రోజు 'మన ఇల్లు-మన లోకేష్' కార్యక్రమంలో మంత్రి పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అత్యున్నత ప్రమాణాలతో తొలి ప్రభుత్వ లీప్ పాఠశాలను మంగళగిరిలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (LEAP) పేరిట నూతన విద్యా విధానానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. ఎన్డీఏ కూటమి ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని ఓ క్రమపద్ధతిలో నెరవేరుస్తోందని లోకేష్ పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

=====================

వేసవి రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే పలు ప్రత్యేక రైళ్లను నడుపుతుందని ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. తిరుపతి - మచిలీపట్నం మధ్య 14 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు ప్రకటించింది. ఈనెల 13 నుంచి మే 25వ తేదీ వరకు ప్రతి ఆదివారం తిరుపతి నుండి మచిలీపట్నంకి, ఏప్రిల్ 14 నుంచి మే 6వ తేదీ వరకు ప్రతి సోమవారం మచిలీపట్నం – తిరుపతికి మధ్య ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయని తెలిపింది. అలాగే చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు మధ్య 24 సర్వీసులు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ రోజు నుంచి జూన్ 27వ తేదీ వరకు ప్రతి శుక్రవారం చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డుకు, ఏప్రిల్ 12వ తేదీ నుంచి జూన్ 28 వరకు ప్రతి శనివారం శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి మధ్య ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయని వెల్లడించింది. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, చీపురపల్లి స్టేషన్లలో ఆగుతాయని పేర్కొంది.

విరామం

=====================

సమాజంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. మహాత్మా జ్యోతిరావు జయంతి వేడుకల సందర్భంగా అనంతపురం జిల్లా పరిషత్ ఆవరణంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మహాత్మ జ్యోతి రావు పూలే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరుపుతోందన్నారు. అసామాన్యుడిగా జన్మించినా సామాజిక విప్లవానికి నాంది పలికినటువంటి వ్యక్తి అన్నారు. సమాజంలో వెనుక బడినటువంటి కులాల, మతాల, సామాజిక వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 26 సెకన్లు)

బీసీల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధన్యతనిస్తుందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పార్వతీపురం కలెక్టర్ కార్యాలయంలో పూలే విగ్రహానికి కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ కలిసి మంత్రి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డా. బాబు జగ్గీవన్ రామ్, జ్యోతిరావు పూలే, డా. బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయులను స్మరించుకొని జయంతి ఉత్సవాలను నిర్వహించుకోవడం గర్వకారణమని అన్నారు.

సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవాతావాది పూలే అని రాష్ట్ర న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ పేర్కొన్నారు. నంద్యాలలో పూలేకు ఆయన నివాళి అర్పించారు. సమాజ పునర్నిర్మాణానికి పూలే చేసిన కృషి చిరస్మరణీయమన్నారు.

=====================

గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలకు పౌష్టికాహార ఆవశ్యకతను తెలియచెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న “పోషణ్ పక్వాడా” కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఎంతో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. జిల్లాలోని ఫిరంగిపురం అంగన్ వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమం కింద వెయ్యి రోజుల సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. అంగన్ వాడీ సూపర్ వైజర్లు తల్లిపాల ప్రాధాన్యత, చిరుధాన్యాల ఆహార ఆవశ్యకత, సఖి వన్ స్టాప్ సెంటర్ వంటి పలు అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న సఖి వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ కె.శాంతి మాట్లాడుతూ... వేధింపులు, లైంగిక హింస, యాసిడ్ దాడులు వంటి వాటికి గురైన వారికి సఖి వన్ స్టాప్ సెంటర్లు అండగా నిలబడతాయని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో 181, లేదా 1098 నంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు.

=====================

ఆన్ లైన్ గేమ్స్, బెట్టింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని, వారి వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్ ఓ ప్రకటనలో సూచించారు. రిఫరల్ లింకులు, కమీషన్లతో ఆకర్షించి నేరగాళ్లు డబ్బు దోచుకుంటున్నారన్నారు. ప్రజలు ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాల్లో మోసపోతే వెంటనే 1930 నెంబరుకు ఫోన్ లేదా cybercrime.gov.in కు ఫిర్యాదు చెయ్యాలని ఆయన సూచించారు.

=====================

ఏజెన్సీలోని కిషోరి బాలికలు చదువుపై దృష్టి సారించి, ఉన్నతమైన ఉద్యోగాలు సాధించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం పిలుపునిచ్చారు. రంపచోడవరం గ్రామంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో కిషోరి వికాసం కార్యక్రమానికి ఆయన హాజరైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఏజెన్సీ ప్రాంత గిరిజనుల కోసం ఉచిత భోజనం వసతితో పాటు ఉచిత విద్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. లింగ, ప్రాంత, మత భేధాలు లేకుండా ప్రతి ఒక్కరూ చదువుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.

=====================
=====================